ప్రజాశక్తి
శుక్రవారం 22 మార్చి, 2024
5
శ్రీకాకుళం



నేడు సదస్సు

శ్రీకాకుళం అర్బన్ : నగరంలోని క్రాంతి భవన్‌లో వాయిస్ ఆఫ్ యంగ్ ఇండియా ఉత్తరాంధ్రా అభివృద్ధి- యువత పాత్ర అన్న అంశంపై శుక్రవారం సదస్సు నిర్వహిస్తున్నట్టు ఎఐవైఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎం.యుగంధర్ తెలిపారు. సిపిఐ కార్యాలయంలో గురువారం విలేకరులతో మాట్లాడారు. 70 ఏళ్లకు పైగా పాలించిన నేతల వల్ల ఉత్తరాంధ్ర ప్రాంతం తీవ్ర నిర్లక్ష్యానికి గురైందని ఆవేదన వ్యక్తం చేశారు. పాలక, ప్రతిపక్ష పార్టీలు రాష్ట్రాన్ని నష్టం చేకూర్చిన బిజెపితో జతకట్టి ఉత్తరాంధ్ర ప్రజలకు మరింత అన్యాయం చేశారన్నారు. జిల్లాలోని గిరిజన ప్రాంతాలను అభివృద్ధి జరగాలంటే ఐటిడిఎ ఏర్పాటు తప్పనిసరని పేర్కొన్నారు. పారిశ్రామికాభివృద్ధి కుంటుపడంతో యువతకు ఉద్యోగాలు రాక ఇతర రాష్ట్రాలకు వలస వెళ్లాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. సదస్సుకు ఎఐవైఎఫ్ మాజీ జాతీయ కార్యదర్శి ఈశ్వరయ్య, రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు రాజేంద్రబాబు, లెనిన్‌బాబు, ప్రముఖ రచయిత అట్టాడ అప్పలనాయుడు, డాక్టర్ దానేటి శ్రీధర్ పాల్గొంటారని తెలిపారు.

ఇద్దరూ.. ఇద్దరే

- సమస్యలపై పోరాడని ఎమ్మెల్యే అచ్చెన్నాయుడు
- ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురాలేని ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్
- మారని టెక్కలి నియోజకవర్గ రూపురేఖలు
- మరోసారి ఓట్ల కోసం పర్యటనలు



సంతబొమ్మాళి మండలం గెద్దలపాడులో శిథిలావస్థకు చేరిన తుపాను షెల్టర్ భవనం



ఆ నియోజకవర్గానికి ఇద్దరు ప్రజాప్రతినిధులు ఉన్నారు. ఒకరేమో నాలుగున్నర ఏళ్లుగా ఎమ్మెల్సీ పదవిని వెలగబెట్టారు. ఒక పార్టీకి రాష్ట్ర అధ్యక్షుడిగా ఉన్నారు. మరొకరు ఎమ్మెల్సీగా అదే ప్రాంతం నుంచి శాసనమండలికి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఇద్దరు ప్రజాప్రతినిధులు ప్రాతినిధ్యం వహిస్తున్న ఆ నియోజకవర్గం ఎంతగానో అభివృద్ధి చెందాలి. ప్రజా సమస్యలు ఎన్నో పరిష్కారం కావాలి. నియోజకవర్గం అభివృద్ధి చూస్తే మాత్రం ఎక్కడి వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారింది. ప్రజా సమస్యలూ అపరిష్కృతంగానే ఉన్నాయి. ఈ పాటికే నియోజకవర్గమేదో ఈ పాటికే తెలిసి ఉంటుంది. అదే టెక్కలి నియోజకవర్గం. ఆ వారెవరో కాదు ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్, ఎమ్మెల్యే, టిడిపి రాష్ట్ర అధ్యక్షులు కింజరాపు అచ్చెన్నాయుడు. ప్రస్తుతం జరుగుతున్న ఎన్నికల్లో మరోసారి ఓట్లు అడిగేందుకు గ్రామాల్లో పర్యటిస్తున్నారు. ఈ నేపథ్యంలో నియోజకవర్గ పరిస్థితిపై కథనం.

ప్రజాశక్తి- శ్రీకాకుళం ప్రతినిధి

టెక్కలి నియోజకవర్గంలో మూలపేట పోర్టు ప్రధాన సమస్యగా ఉంది. పోర్టును నిర్మించే క్రమంలో ప్రభుత్వం అనేక అడ్డదారులు తొక్కింది. సంతబొమ్మాళి మండలం మూలపేట, విష్ణుచక్రం గ్రామాలకు చెందిన ప్రజలను అనేక ఇబ్బందులకు గురిచేసింది. రైతులు వ్యతిరేకిస్తున్నా బలవంతంగా భూములను తీసుకుంది. ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ కోసం ఇళ్లు, పశువుల శాలలు తదితర స్ట్రక్చర్ల విలువ కోసం పోలీసు బలగాలను పెట్టి బలవంతంగా చేయించారు. పోర్టు నిర్మాణం విషయంలో ప్రభుత్వ తీరును ప్రశ్నించిన వారిపై బైండోవర్ కేసులు సైతం నమోదు చేశారు. పోర్టుకు భూములివ్వని వారి పంటలను బుల్డోజర్లతో తొక్కించింది. ఒక్క మాటలో చెప్పాలంటే ప్రభుత్వం తీవ్ర దమనకాండను ప్రదర్శించింది. పోర్టు నిర్వాసితుల సమస్యలను పరిష్కరించాల్సిన ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ పోర్టు నిర్మాణానికి అవసరమైన మెటీరియల్ సరఫరా కాంట్రాక్టు పనులను చేజిక్కించుకుని సొంత లాభం చూసుకున్నారన్న విమర్శలు ఉన్నాయి. ఎమ్మెల్యేగా తమకు అండగా ఉంటారని ప్రజలు ఓటేసి ఎమ్మెల్యే కింజరాపు అచ్చెన్నాయుడుని గెలిపిస్తే ఆయన పరిస్థితీ అందుకు భిన్నంగా ఏమీ లేదు. నియోజకవర్గ ప్రజల ఏనాడూ అటు వైపు కన్నెత్తి చూడలేదు. కోటబొమ్మాళిలోని క్యాంప్ కార్యాలయాల్లో కార్యకర్తలతో సమావేశాలు నిర్వహించి అమరావతి, విశాఖ వంటి ఇతర ప్రాంతాల్లో ఎక్కువ కాలం గడిపిన అచ్చెన్నాయుడు, ఎన్నికలు రావడంతో ఇప్పుడు గ్రామాల్లో ప్రచారం మొదలు పెట్టారు.

అసంపూర్ణంగానే ఆఫ్‌షోర్

ఆఫ్‌షోర్ పూర్తికి టిడిపి, వైసిపికి ఐదేళ్లూ సరిపోలేదు. 2014లో అధికారంలోకి వచ్చిన టిడిపి ప్రభుత్వం అంచనా వ్యయాన్ని రూ.123.25 కోట్ల నుంచి రూ.466.28 కోట్లకు పెంచి హదరాబాద్‌కు చెందిన ఎస్‌విఇసి-ఇందు సంస్థకు అప్పగించింది. రిజర్వాయరు 2019 జూలై నాటికి పూర్తి కావాల్సి ఉంది. 2019లో టిడిపి అధికారం కోల్పోయే నాటికి 38 శాతం పనులే పూర్తయ్యాయి. అధికారంలోకి వచ్చిన వైసిపి ప్రాజెక్టు అంచనా వ్యయాన్ని రూ.4668.28 కోట్ల నుంచి రూ.852.25 కోట్లకు పెంచింది. ఇప్పటివరకు పనులు 45 శాతమే జరిగాయి. రిజర్వాయరు పూర్తయితే టెక్కలి, నందిగాం మండలాలకు తాగు, నీరు లభించేది.

కనీస సౌకర్యాలూ కల్పించలేని దుస్థితి

నియోజకవర్గంలో గ్రామాల్లో కనీస మౌలిక సౌకర్యాలు కల్పించలేకపోయారు. సంతబొమ్మాళి మండలం మేఘవరం, మరువాడ నుంచి బోరుభద్ర రహదారి పూర్తిగా పాడయ్యాయి. అదే మండలం గెద్దలపాడు, డి.మరువాడ, జగన్నాథపురం, సున్నాపల్లి, సూరాడవానిపేట తదితర ప్రాంతాల్లో నిర్మించిన తుపాను షెల్టర్లు పూర్తిగా శిథిలావస్థకు చేరాయి. అదేవిధంగా వలలు భద్రపరుచుకునేందుకు నిర్మించిన షోర్ షెడ్లు కూడా పూర్తిగా పాడయ్యాయి. నందిగాం మండలంలో నందిగాం నుంచి సైలాడ వరకు ఉన్న పది కిలోమీటర్ల రోడ్డును సుమారు పదేళ్ల కిందట నిర్మించారు. గుంతలదారిలోనే ప్రజలు రాకపోకలు సాగిస్తున్నారు. కోటబొమ్మాళి మండలం జాతీయ రహదరి-16 నుంచి కన్నెవలస, కురుడు నుంచి ఎరకపేట, హరిశ్చంద్రపురం నుంచి నిమ్మాడ రోడ్లు దారుణంగా ఉన్నాయి. టెక్కలిలో ఏర్పాటు చేసిన జిల్లా కేంద్రాస్పత్రిలో వైద్య సిబ్బంది లేక రిఫరల్ ఆస్పత్రిగా మారింది.

సాగునీటి సమస్యల పరిష్కారంలో వైఫల్యం

నియోజకవర్గంలో సాగునీటి సమస్య తీవ్రంగా ఉంది. నియోజకవర్గంలోని నాలుగు మండలాలకు వంశధార ఎడమ కాలువయే ప్రధాన నీటి వనరుగా ఉంది. వంశధార కాలువ గట్లు బలహీనంగా ఉండటంతో శివారు భూములకు నీరందని పరిస్థితి నెలకొంది. కాలువలను ఆధునికీకరణ చేస్తామని చెప్పిన ఇద్దరు ప్రజాప్రతినిధులు ఆ మాట నిలబెట్టుకోలేదు. 2023 ఖరీఫ్‌లో తీవ్ర వర్షాభావ పరిస్థితులతో రైతులు సాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్న సమయంలో చిన్నసాన ఎత్తిపోతల పథకానికి విద్యుత్ సరఫరా ఆపేయాలని ఆపేయాలని పశుసంవర్థక, మత్స్యశాఖ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు ఇచ్చిన ఆదేశాలతో తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఎమ్మెల్యే అచ్చెన్నాయుడు, ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ ఈ విషయంలో తమకు అండగా నిలబడలేదన్న ఆవేదన రైతుల్లో నెలకొంది.

పారదర్శకత లోపిస్తే చర్యలు

- జిల్లాలో 183 అత్యంత సమస్మాత్మక గ్రామాలు గుర్తింపు
- విశాఖ రేంజ్ డిఐజి విశాల్ గున్ని




మాట్లాడుతున్న డిఐజి విశాల్ గున్ని

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

పోలీసులపై ప్రజల్లో నమ్మకం పెంచేవిధంగా ఎన్నికల ప్రవర్తనా నియమావళి నిస్పక్షపాతం, పారదర్శకం అమలు చేయాలని, వాస్తవానికి విరుద్ధమైన చర్యలకు పాల్పడితే చర్యలు తప్పవని విశాఖ రేంజ్ డిఐజి విశాల్ గున్ని పేర్కొన్నారు. జిల్లా పర్యటనకు వచ్చిన ఆయన పోలీసు కార్యాలయంలో ఎన్నికల ఏర్పాట్లపై గురువారం సమీక్షించారు. అనంతరం కాన్ఫరెన్స్ హాల్‌లో విలేకరులతో మాట్లాడారు. ఎన్నికలు సజావుగా జరగడానికి పోలీస్ వ్యవస్థ ఇప్పటికే పటిష్ట ఏర్పాట్లు చేసిందని వివరించారు. క్షేత్రస్థాయిలో ప్రతి గ్రామాన్నీ అధ్యయనం చేసి ఎన్నికల సమయంలో ఎటువంటి అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా తగిన చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. పారదర్శకంగా ఎన్నికలు నిర్వహించేలా చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. ఇప్పటికే జిల్లాలో 183 అత్యంత సమస్మాత్మక, 132 సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించామని పేర్కొన్నారు. గత అనుభవాలను పరిగణలోకి తీసుకుని వ్యక్తులపై, పరిసరాలపై నిఘా పెంచామన్నారు. ప్రధానంగా గ్రామస్థాయిలో వనర్ బుల్టీ, ర్యాపిడ్ సెన్సిటివిటీ, హైఫర్ సెన్సిటివిటీపై ఎస్‌పి, అదనపు ఎస్‌పిలు దృష్టి సారించాలని ఆదేశించారు. హోంగార్డు మొదలు ఉన్నతాధికారి వరకు ఎటువంటి పొరపాట్లకు తావీయకుండా తగిన జాగ్రత్తలు తీసుకుంటున్నట్టు తెలిపారు. ఎస్‌పిస్థాయి అధికారి చేతిలో ప్రతి గ్రామానికీ చెందిన రూట్‌మ్యాప్ ఉండేవిధంగా చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. సరిహద్దుల్లో నాటుసారా, మద్యం అక్రమ రవాణాను నియంత్రించేందుకు చర్యలు తీసుకుంటున్నామని స్పష్టం చేశారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు సోషల్ మీడియాలో ఒకరిపై ఇంకొకరు దుర్భాషలాడడం, రెచ్చగొట్టే చర్యలకు పాల్పడడం వంటి ఘటనలకు తావు లేకుండా ప్రత్యేక నిఘా ఉంచామన్నారు. జిల్లాలో ఏడు అంతర్ జిల్లా చెక్‌పోస్టులు, మరి కొన్ని ఇంట్రా చెక్‌పోస్టులను ఏర్పాటు చేశామని చెప్పారు. జిల్లాలో ముగ్గురిపై పిడి యాక్టు అమలులో ఉందని, వారిని జిల్లా బహిష్కరణ విధిస్తున్నట్టు తెలిపారు. అలాగే గడచిన ఆరు నెలల వ్యవధిలో నేరాలకు పాల్పడుతున్న వారు, వివిధ కేసుల్లో అరెస్టయిన వారిపై స్టేషన్ స్థాయిలో పర్యవేక్షణ ఉంటుందన్నారు. ఇప్పటికే కొందరిపై బైండోవర్ కింద కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. ప్రతి ఓటరు తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు స్వేచ్ఛాయుత వాతావరణాన్ని కల్పిస్తున్నామన్నారు. అంతర్రాష్ట్ర సరిహద్దులు, ఏజెన్సీల్లో 17 సిఆర్‌పిఎఫ్ (గ్రేహండ్స్) బలగాలు కూబింగ్ నిర్వహిస్తున్నట్టు వివరించారు. అలాగే ఎన్నికల బందోబస్తు కోసం జిల్లాకు 10 కంపెనీల పారామిలటరీ దళాలు చేరుకున్నాయని అన్నారు. సమావేశంలో ఎస్‌పి జి.ఆర్.రాధిక, అదనపు ఎస్‌పి ప్రేమకాజల్ పాల్గొన్నారు. అంతకుముందు ఆర్మ్డ్ రిజర్వు పోలీసుల నుంచి ఆయన గౌరవవందనాన్ని స్వీకరించారు. ఎస్‌పి పుష్పగుచ్ఛాన్ని అందజేశారు.

అంతర్రాష్ట్ర సరిహద్దుల్లో నిఘా పటిష్టం

జిల్లా ఎన్నికల అధికారి మనజీర్ జిలానీ సమూన్



మెళియాపుట్టి : చెక్‌పోస్టును పరిశీలిస్తున్న కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్

ప్రజాశక్తి- పాతపట్నం, మెళియాపుట్టి

సాధారణ ఎన్నికల నేపథ్యంలో అంతర్రాష్ట్ర సరిహద్దుల్లో నిఘా పటిష్టం చేశామని, సరిహద్దుల్లో అవాంఛనీయ సంఘటన జరగకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్ ఆదేశించారు. పాతపట్నం సాధారణ ఎన్నికల కోసం నియోజకవర్గానికి సంబంధించి ఏర్పాటు చేస్తున్న పోలింగ్ కేంద్రాలు, డిస్ట్రిబ్యూషన్ కేంద్రం, స్ట్రాంగ్ రూమ్‌ల్లో ఏర్పాట్లను గురువారం పరిశీలించారు. చేపట్టాల్సిన పనులపై ఆరా తీసి సూచనలు అందజేశారు. తహశీల్దార్ కార్యాలయంలో ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లపై ఆరా తీసి సంబంధిత రికార్డును పరిశీలించారు. అనంతరం మెళియాపుట్టి మండలం అంతర్ రాష్ట్ర సరిహద్దు, వసుంధర చెక్‌పోస్టును పరిశీలించారు. మెళియాపుట్టి జెడ్‌పి హెచ్‌ఎస్ స్కూల్, జలకలింగుపురం పోలింగ్ బూత్‌లను పరిశీలించారు. మద్రిపాడు సచివాలయ పరిధిలోని జలకలింగుపురం పోలింగ్ స్టేషన్ పరిశీలించి పోలింగ్ బూత్ ముంధర వద్ద ఉన్న రహదారిని సరిచేయాలని ఆదేశించారు. ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు, ప్రజలు స్వేచ్ఛగా, నిర్భయంగా తమ ఓటు హక్కు వినియోగించుకునేందుకు పటిష్టమైన భద్రతా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. జిల్లాలోని ఎనిమిది నియోజకవర్గాలకు సంబంధించి ఎన్నికల డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలు, ఇవిఎంలు, స్ట్రాంగ్ రూమ్‌ల కోసం ఏర్పాట్లను ఆయా అధికారులంతా వేగవంతం చేయాలన్నారు. ఎన్నికల కమిషన్ సూచనల ప్రకారం ఏర్పాట్ల విషయమై పకడ్బందీ చర్యలు తీసుకోవాలన్నారు. భద్రతపరంగా ఎలాంటి ఇబ్బంది లేకుండా పటిష్టమైన చర్యలు చేపట్టాలన్నారు. పోలింగ్ సిబ్బందికి సామగ్రిని అందించడంలో ఎలాంటి లోటుపాట్లు ఎదురుకాకుండా ఏర్పాట్లు చేయాలన్నారు. ఈయన వెంట సహాయ కలెక్టర్ రాఘువేంద్ర మీనా, ఆయా మండలాల తహశీల్దార్లు, ఎన్నికలు విధులకు సంబంధించిన అధికారులు ఉన్నారు.

ఎన్‌ఎసిఎల్ కార్మికుల విజయం



ఒప్పంద పత్రాలను స్వీకరిస్తున్న సిఐటియు నాయకులు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

ఐక్యంగా చర్చల ద్వారా వేతనాలు పెంచుకుని విజయం సాధించిన నాగార్జున అగ్రికెమ్ కార్మికులకు సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జిల్లా సిహెచ్.అమ్మన్నాయుడు, పి.తేజేశ్వరరావు అభినందనలు గురువారం తెలిపారు. ఎచ్చెర్ల మండలం చిలకపాలెం వద్ద ఉన్న ఎన్‌ఎసిఎల్ కార్మికులకు, యాజమాన్యానికి సుదీర్ఘ చర్చలు అనంతరం ఎటువంటి ఆందోళనలు, పోరాటాలు లేకుండా వేతన ఒప్పందం జరగడం మంచి పరిణామమని అన్నారు. కార్మికులు యాజమాన్యానికి మధ్య సుహృద్భావ వాతావరణంలో 18 నెలల పాటు సుదీర్ఘ చర్చలు ద్వారా ఒక ఉమ్మడి అంగీకారానికి వచ్చారని అన్నారు. గత వేతన ఒప్పందం సెప్టెంబరు 2022తో ముగియడంతో నూతన వేతన ఒప్పందానికి నాగార్జున అగ్రికెమ్ పరిశ్రమ యాజమాన్యానికి, సిఐటియు అనుబంధ ఎన్‌ఎసిఎల్ ఛార్టర్ ఆఫ్ డిమాండ్స్ అందజేశామని అన్నారు. పలు దఫాలు చర్చలు జరిగాయన్నారు. చివరిగా గురువారం విశాఖపట్నం జాయింట్ కమిషనర్ ఆఫ్ లేబర్ గణేష్ సమక్షంలో జరిగిన చర్చలు సఫలం కావడంతో నూతన వేతన ఒప్పందం జరిగిందన్నారు. ప్రస్తుతం ఉన్న వేతనంపై కార్మికులకు నెలకు రూ.3,750 పెంచడానికి యాజమాన్యం అంగీకరించిందని తెలిపారు. రాత్రి విధుల్లో ఉన్న కార్మికులకు రోజుకు ప్రస్తుతం ఉన్న అలవెన్స్ రూ.32 నుంచి రూ.45, అటెండెన్స్ బోనస్ నెలకు రూ.90 పెంచారని అన్నారు. ప్రస్తుత వేతన ఒప్పందం కాలపరిమితి 2025 వరకు అమలులో ఉంటుందని అన్నారు. చర్చల్లో ఎన్‌ఎసిఎల్ యూనిట్ హెడ్ కె.శేషగిరిరావు, కార్పొరేట్ హెచ్‌ఆర్ ఎస్.మణిప్రసాద్, హెచ్‌పిడి హెడ్ కె.శ్యాంప్రసాద్, హెచ్‌ఆర్ జి.మహేశ్వరరావు, డి.శేషగిరిరావు, సిహెచ్.రమణ నాగార్జున అగ్రికెమ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎల్.వరదరాజు, ఎం.రమణ యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్ తొలగింపు

ప్రజాశక్తి- మందస

మందస మండలం భోగాపురం పంచాయతీకి చెందిన ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ అగ్గున్న దేవేంద్రను విధుల నుంచి తొలగించినట్లు గ్రామీణ ఉపాధి హామీ పథకం పథక సంచాలకులు జి.వి.చిట్టి రాజు ఒక ప్రకటనలో తెలిపారు. దేవేంద్ర రాజకీయ పార్టీల ఎన్నికల ప్రచారంలో పాల్గొంటున్నట్లు ఫిర్యాదు వచ్చిందన్నారు. స్వయంగా విచారణ చేపట్టామని తెలిపారు. పలాస రిటర్నింగ్ అధికారి, ఆర్‌డిఒ భరత్ నాయక్ దాన్ని ధ్రువీకరించారని అన్నారు. దీంతో ఎన్నికల నియమావళిని ఉల్లంఘించినట్లు స్పష్టం కావడంతో దేవేంద్రను తాత్కాలికంగా ఒప్పంద విధుల నుంచి తప్పించినట్టు ఉత్తర్వులో పేర్కొన్నారు.

'గేట్'లో విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి- ఎచ్చెర్ల

నూజివీడు ఆవరణలోని శ్రీకాకుళం క్యాంపస్ గేట్-2024లో ఉత్తమ ప్రతిభను కనబరిచారు. వీరికి రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం క్యాంపస్‌లో విద్యార్థులకు వైస్ ఛాన్సలర్ ఆచార్య ఎం.విజయ్ కుమార్ గురువారం అభినందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులకు ప్రత్యేక సూచనలు చేస్తూ ఇంకా ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు, ప్రోత్సహించిన అధ్యాపకులకు అభినందనలు తెలిపారు. క్యాంపస్ డైరెక్టర్ ఆచార్య బాలాజీ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని విద్యార్థులు గేట్‌లో మంచి ర్యాంకులు సాధించడం రాజీవ్ గాంధీ యూనివర్శిటీలో మిగతా విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలన్నారు.

మంచి ప్రతిభ కనబరిచి సివిల్ సర్వీసెస్, మంచి ఇంజినీర్లుగా ఉన్నత ఉద్యోగాలు సాధించాలన్నారు. కార్యక్రమంలో ఒఎస్‌డి సుధాకర్‌బాబు, రిజిస్ట్రార్ డాక్టర్ గోపాలరాజు, డీన్ అకడమిక్స్ దువ్వూరి శ్రావణి, పరిపాలన అధికారి ముని రామకృష్ణ, డీన్ మోహన్‌కృష్ణ చౌదరి, ఎఫ్ఒ డాక్టర్ అసిరినాయుడు, వెల్ఫేర్ డీన్ గేదెల రవి, సతీష్ కుమార్ పాల్గొన్నారు.

ఓటింగ్ ప్రక్రియపై శిక్షణ

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

సార్వత్రిక ఎన్నికల్లో ఇవిఎంలు, వివి ప్యాట్స్ కనెక్షన్లు, బ్యాలెట్ యూనిట్లు సెట్టింగ్‌ను తనిఖీ చేసుకోవాలని జిల్లాస్థాయి ముఖ్య శిక్షణ బృందం అధికారులు ఎం.కిరణ్ కుమార్, బాలాజీ నాయక్, శేషగిరిలు అన్నారు. జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో బాలెట్ యూనిట్, కంట్రోల్ యూనిట్, వివి ప్యాట్స్ మిషన్ వినియోగంపై గురువారం శిక్షణ ఇచ్చారు. శిక్షణలో ఓటర్స్ స్లిప్, ఫారమ్‌లు 17-ఎ, 17-బి, 17-సి, 14, 14-ఎ, ఎం-21, మాక్ పోల్ ధ్రువపత్రం, డిక్లరేషన్ ఫారమ్ వంటి అవసరమైన ఫారాలను పూరించడంపై ప్రయోగాత్మక శిక్షణ ఇచ్చారు. శిక్షణ సమయంలో డిస్పాచ్ సెంటర్‌లో కార్యకలాపాలు, పోలింగ్ స్టేషన్లలో ఏర్పాట్లు, పోలింగ్ ప్రారంభం విధానాలు, క్లోజర్ ప్రోటోకాల్‌లు, పోలింగ్ అనంతరం యంత్రాల సీలింగ్, మెటీరియల్‌ల సీలింగ్, ఈవిఎం, వివి ప్యాట్ ల నిర్వహణపై కూడా చర్చించారు. పోలింగ్ ప్రారంభించడానికి ముందు, పోలింగ్ పూర్తయిన తర్వాత ఏం చేయాలి? ఏం చేయకూడదు? అనే అంశాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పోలింగ్ ప్రారంభానికి ముందు తప్పనిసరిగా ఏజెంట్ల సమక్షంలో మాక్ పోలింగ్ నిర్వహించాలన్నారు. పోలింగ్ ప్రక్రియ, మాక్ పోలింగ్ ప్రక్రియను గురించి అందించిన బుక్ లెట్‌లోని ప్రతి అంశాన్నీ క్షుణ్ణంగా చవాలన్నారు. విధి నిర్వహణలో ఎలాంటి అవరోధాలు లేకుండా పనిచేయాలని సూచించారు. పోలింగ్ ప్రక్రియలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టాలన్నారు. శిక్షణలో మొత్తం 130 మంది ప్రిసైడింగ్, పోలింగ్ అధికారులు హాజరయ్యారు. వారికి పవర్ పాయింట్ ప్రజెంటేషన్, ఆడియో వీడియోల ద్వారా ఒక్కరోజు శిక్షణను పూర్తి చేశారు.



శిక్షణ ఇస్తున్న జిల్లాస్థాయి బృందం అధికారులు

ఖైదీలకు ఉచిత న్యాయ సహాయం

న్యాయ సేవాధికార సంస్థ జిల్లా కార్యదర్శి సన్యాసినాయుడు



మాట్లాడుతున్న సన్యాసినాయుడు

శ్రీకాకుళం అర్బన్ : ఎటువంటి ఆర్థిక స్థోమత లేక సరైన న్యాయం పొందలేక క్రిమినల్ కేసుల్లో ఇరుక్కుని జైళ్లలో మగ్గుతున్న ఖైదీలకు ఉచిత న్యాయ సహాయం అందించేదుకు ఉచిత లీగల్ సెల్ ఏర్పాటు చేసినట్టు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఎం.సన్యాసినాయుడు తెలిపారు. సంస్థ కార్యాలయంలో గురువారం విలేకరులతో మాట్లాడారు. జాతీయ లీగల్ సర్వీస్ ఆథారిటీ ఆదేశాల మేరకు రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల నాయయస్థానాల్లో ఈ కేంద్రాలు ప్రారంభించినట్టు తెలిపారు. క్రిమినల్ కేసుల్లో ఇరుక్కుని జైళ్లలో ఉన్న ఖైదీలకు ఈసెల్ ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. న్యాయసాయం కోసం ఎదురు చూస్తున్న పేద ఖైదీలు ఈ సౌకర్యాన్ని వినియోగించుకోవాలని సూచించారు. సమావేశంలో న్యాయవాది ఇందిరాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.


పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ నూరుల్ కమర్

పోలింగ్ కేంద్రం పరిశీలన

ప్రజాశక్తి- నందిగాం

మండలంలోని ఉయ్యాలపేట పోలింగ్ కేంద్రాన్ని టెక్కలి నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, టెక్కలి సబ్ కలెక్టర్ నూరుల్ కమర్ గురువారం పరిశీలించారు. మౌలిక సదుపాయాలతో పాటు ఎంతమంది ఓటర్లు ఓటుహక్కును వినియోగించుకుంటారు వంటి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈయనతో పాటు సెక్రటరీ జీవన్ రెడ్డి ఉన్నారు.


మాట్లాడుతున్న బృందావన్ దొలై

7న 'మేధా సమ్మాన్' ప్రతిభా పరీక్ష

ప్రజాశక్తి- కవిటి

జిల్లాలో ఒడియా మాధ్యమంలో చదువుతున్న ఐదో తరగతి పిల్లలకు ఆంధ్రప్రదేశ్ ఒడియా టీచర్స్ అసోసియేషన్ (ఆపోటా) తరపున ఏప్రిల్ 7న జిల్లాస్థాయి మేధా సమ్మాన్ ప్రతిభా పరీక్ష నిర్వహిస్తున్నట్లు ఆపోటా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బృందావన్ దోలై తెలిపారు. ఈ మేరకు మండలం పెద్ద మెలియాపుట్టుగ ఒడియా ఉన్నత పాఠశాల ఆవరణలో గురువారం సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఇచ్ఛాపురం, కంచిలి, కవిటి, సోంపేట, మందస, పలాస, టెక్కలి, మెళియాపుట్టి, పాతపట్నం, భామిని మండలాల్లో ఈ పరీక్షలు నిర్వహిస్తున్నట్టు ఆయన తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఒడియా విద్యార్థుల సంఖ్య పెరగడానికి ఈ పరీక్షలు దోహదపడతాయన్నారు. మండల శాఖ అధ్యక్షుడు కేశవ పురియా, కార్యదర్శి మనోజ్ కుమార్, పాఠశల హెచ్ఎం ఉమా మహాపాత్రో, ప్రమోద్ కుమార్ పాడి, ప్రదీప్ కుమార్ గౌడ, సదానంద గౌడ, క్షమానంద చౌదరీ, మనోజ్ కుమార్ మహారాణ, ప్రదీప్ గౌడ పాల్గొన్నారు.


వినతిపత్రం అందజేస్తున్న యుటిఎఫ్ నాయకులు

అక్రమాలపై చర్యలు తీసుకోవాలి

టెక్కలి : ప్రస్తుతం జరుగుతున్న పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో ఇన్విజిలేటర్లు, చీఫ్, డిపార్ట్మెంట్ అధికారుల నియామకాల్లో జరిగిన అవకతవకలు, అక్రమాలపై చర్యలు తీసుకోవాలని టెక్కలి మండల యుటిఎఫ్‌శాఖ అధికారులను డిమాండ్ చేశారు. గురువారం ఉప విద్యాశాఖ కార్యాలయ అధికారులకు, మండల విద్యాశాఖ కార్యాలయ అధికారులకు వినతిపత్రం ద్వారా కోరారు. పదో తరగతి పరీక్షల్లో ఇన్విజిలేటర్లు, చీఫ్, డిపార్ట్మెంట్ అధికారుల నియామకాలు నిబంధనలకు విరుద్ధంగా జరిగాయని, సీనియర్లను కాదని జూనియర్లకు బాధ్యతలు అప్పగించడంలో విద్యాశాఖ కార్యాలయంలో ఇద్దరు ఉపాధ్యాయులు ప్రమేయం ఉందన్నారు. వీరిద్దరు అన్నదమ్ములుగా ఉండడంవలన నియామకాల్లో అవకతవకలు జరిగాయని, తమ కుటుంబసభ్యులు పరీక్ష రాస్తున్న కేంద్రాల్లో వారు ఇన్విజిలేటర్లగా నియామకాలు జరిగాయన్నారు. వీటన్నింటిపై పరిశీలన జరిపి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వినతిపత్రం అందజేసిన వారిలో యుటిఎఫ్ మండలశాఖ ప్రధాన కార్యదర్శి తమ్మినేని వైకుంఠరావు, పి.గణపతిరావు, జిల్లా సహాధ్యక్షులు కురమాన దాలయ్య, రొణంకి విజయ్ కుమార్, డొంకాన పాపారావు, బాలక శంకరరావు, పాలవలస ధర్మారావు, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

విజయలక్ష్మికి సన్మానం

ఆమదాలవలస : బార్ అసోసియేషన్ అధ్యక్షులు కణితి విజయలక్ష్మి భాయ్‌కు న్యాయవాదులు ఘనంగా సన్మానించారు. గురువారం కోర్టు ఆవరణలో ఆమెకు పుష్పగుచ్ఛం అందించి శాలువతో జూనియర్ సివిల్ జడ్జి ఎస్.మణి సన్మానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బార్ అధ్యక్షులుగా మూడోసారి ఎన్నిక కావడం ఆనందంగా ఉందన్నారు. భవిష్యత్‌లో మరెన్నో ఉన్నత పదవులను అధిరోహించాలని ఆకాంక్షించారు. అనంతరం ఇటీవల జిల్లా రెండో ఆదనపు మహిళా సెషన్స్ కోర్టు ఏపీపీగా నియమితులైన చింతాడ సత్యనారాయణకు న్యాయవాదులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సీపాన గోవిందరావు, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్, మహిళా న్యాయవాది కూన వెంకట రాజ్యలక్ష్మి, న్యాయవాదులు సాధు ధనుంజయరావు, బుర్లె సీతారాం, బొడ్డేపల్లి మోహనరావు, పైడి వరాహ నరసింహం, కిల్లి మార్కండేయులు, కింతలి త్రినాధరావు పాల్గొన్నారు.

అడవులే రక్షణ కవచాలు

శ్రీకాకుళం అర్బన్: మానవ మనుగడకు చెట్లు ఎంతో ఉపకరిస్తాయని నగరానికి చెందిన స్టార్ వాకర్స్ క్లబ్ సభ్యులు చెప్పారు. శ్రీకాకుళం ఆర్ట్స్ కళాశాల ఆవరణలో స్టార్ వాకర్స్ ఆధ్వర్యాన ప్రపంచ అటవీ దినోత్సవ వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విశ్రాంత ఎంఇఒ చెంచులాపు సింహాచలం మాట్లాడుతూ ఆక్సిజన్ సమృద్ధిగా ఉన్న ప్రాంతాల్లో నివసించే వారి ఆయుప్రమాణాలు గణనీయంగా పెరగడానికి దోహదపడతాయన్నారు. స్టార్‌వాకర్సు మాజీ గవర్నర్ జి.ఇందిరాప్రసాద్ మాట్లాడుతూ మనిషి మనుగడ చెట్లతో ఆధారపడి ఉందన్నారు. స్టార్ వాకర్సు కో-ఆర్డినేటర్ ఎస్.జోగినాయుడు, అధ్యక్షుడు బి.రవిశంకర్, కార్యదర్శి బి.దేవీప్రసాద్, పాలకొండ ప్రశాంత్, కొండలరావు పాల్గొన్నారు.

న్యాయవాదుల సంక్షేమానికి కృషి

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

జిల్లా బార్ అసోసియేషన్ అభివృద్ధికి, న్యాయవాదుల సంక్షేమానికి ఎల్లప్పుడూ కట్టుబడి ఉన్నానని, మరోసారి తనకు అవకాశం కల్పించి జిల్లా బార్ అసోసియేషన్‌గా గెలిపించాలని జిల్లా బార్ అసోసియేషన్ అపద్ధర్మ అధ్యక్షులు, న్యాయశ్రీ అవార్డు గ్రహీత డాక్టర్ ఎన్ని సూర్యారావు విజ్ఞప్తి చేశారు. నగరంలోని ఓ ప్రయివేటు భవనంలో గురువారం విలేకరులతో మాట్లాడారు. న్యాయవాదులందరి సహకారంతో పలు అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించానని తెలిపారు. భూహక్కు చట్టంపై పలు నిరసన, ధర్నా కార్యక్రమాలు చేపట్టామని గుర్తు చేశారు. కార్యక్రమంలో బిసి అడ్వకేట్స్ అసోసియేషన్ అధ్యక్షులు ఆగూరు ఉమామహేశ్వరరావు, బిసి అడ్వకేట్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి చౌదరి లక్ష్మణరావు, ప్రెస్‌క్లబ్ అధ్యక్షులు కొంక్యాన వేణుగోపాలరావు, న్యాయవాదులు గేదెల ఇందిరాప్రసాద్, బగాది అప్పలనాయుడు పాల్గొన్నారు.

అధికార పార్టీ వికృత చేష్టలు

పలాస : రానున్న ఎన్నికల్లో అధికార పార్టీని సమర్ధవంతంగా ఎదుర్కొందామని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష విజ్ఞప్తి చేశారు. టిడిపి కార్యాలయంలో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అధికార పార్టీ తన వికృత చేష్టలకు తెరలేపిందని, ఇటువంటి కార్యక్రమాలపై ఎన్నికల అధికారికి దృష్టికి తీసుకువెళ్లాలని విజ్ఞప్తి చేశారు. ఎన్నికల కమిషన్ విడుదల చేసిన సివిజెల్ యాప్‌ను అందరూ మొబైల్‌లో డౌన్‌లోడ్ చేసుకుని ఎప్పటికప్పుడు అధికార పార్టీ దురాగతాలని ఎన్నికల అధికారులకు ఫిర్యాదు చేయాలని స్పష్టం చేశారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు

ఇచ్ఛాపురం: ప్రింటింగ్ ప్రెస్ యజమానులు ఎటువంటి రాజకీయ ముద్రణలు చేసిన వాటి వివరాలు కంట్రోల్ రూమ్‌కు తెలియజేయాలని ఎన్నికల రిటర్నింగ్ అధికారి సుదర్శన్ దొర సూచించారు. స్థానిక రెవెన్యూ కార్యలయంలో ప్రింటింగ్ ప్రెస్ యజమానులతో సమావేశం నిర్వహించారు. ఎవరైనా నిబంధనలు ఉల్లంగిస్తే కఠినంగా చర్యలు ఉంటాయన్నారు.

చెక్‌పోస్టుల వద్ద పటిష్ట నిఘా

ఎక్సైజ్ అధికారులను ఆదేశించిన కలెక్టర్

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

చెక్‌పోస్టుల వద్ద పటిష్టమైన నిఘా పెంచాలని జిల్లా ఎన్నిక అధికారి, కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో అధికారులతో గురువారం సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిన తర్వాత జరుగుతున్న అమ్మకాలు, ఎక్కడైనా ఎక్కువ మోతాదులో నిల్వ చేసిన అక్రమ మద్యంపైన, అక్రమ మద్యం రవాణా గురించి, ఎక్సైజ్, సెబ్ కలిసి నివారణకు చర్యలు తీసుకోవాలన్నారు. ఎచ్చెర్లలోని ఎపిఎస్బిసిఎల్ డిపో నుంచి ప్రభుత్వ మద్యం దుకాణాలు, బార్లకు మద్యం ఏ విధంగా సరఫరా చేయు వాహనాల జిపియస్, రూట్ మ్యాప్, తదితర విషయాలను అడిగి తెలుసుకున్నారు. షాపులు తనిఖీ చేయాలని అధికారులను ఆదేశించారు. షాపుల్లో రోజు వారీ రిజిష్టర్లు మెంటైన్ చేస్తున్నది లేనిది అడిగి తెలుసుకున్నారు. వివిధ ప్రాంతాల నుంచిఏ వచ్చే మద్యంపైన దృష్టి సారించాలన్నారు. చెక్‌పోస్టుల వద్ద పటిష్టమైన నిఘా పెట్టాలని ఆదేశించారు. మీ సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేసి వారి వారి ప్రాంతాల్లో ఉన్న పరిస్థితులపై సమీక్షించాలన్నారు. ఒక వ్యక్తి మూడు బాటిళ్లు మాత్రమే అనుమతిస్తున్నట్లు ఎక్సైజ్ సూపరింటెండెంట్ సుబ్బారావు కలెక్టర్‌కు వివరించారు. జిల్లాకు పక్కనే ఉన్న సరిహద్దు ప్రాంతాల్లో 14 షాపులను గుర్తించినట్లు చెప్పారు. రణస్థలం మండలం బంటుపల్లి వద్ద ఉన్న యునైటెడ్ బ్రెవరేజస్ ప్రయివేట్ లిమిటెడ్‌లో తయారు అవుతున్న బీరుపై ఆరా తీశామన్నారు. కంపెనీ నిర్వహణపై బ్రెవరేజస్ యాజమాన్యంపై డిస్టిలరీ ఆఫీసర్‌ను వివరాలు అడిగి తెలుసుకున్నామని చెప్పారు. ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిన నేపథ్యంలో బీర్ల తయారీ తగ్గించాలని ఆదేశించారు. కంట్రోల్ రూమ్‌లో వెబ్ కాస్టింగ్ ద్వారా బీర్ల ఫ్యాక్టరీ, ఎపిఎస్బిసిఎల్ హోల్‌సేల్స్‌ను 24ఇంటు7 పరిశీలించాలన్నారు. ఒరిస్సా బోర్డర్‌లో ఏవిధంగా చూస్తున్నది అదనపు ఎస్‌పి గంగాధరంను అడిగి తెలుసుకున్నారు. సమావేశంలో సెబ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ తిరుపతినాయుడు, యునైటెడ్ బ్రెవరి లిమిటెడ్ డిస్టిలరీ ఆఫీసర్ ఎం.ఆర్.కె.దాస్, బ్రెవరీ యాజమాన్యం పాల్గొన్నారు.


సమీక్షిస్తున్న కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్

ఒక్క ఛాన్స్‌తో రాష్ట్రం అధోగతి


ఆమదాలవలస : ప్రచారం చేస్తున్న రవికుమార్, రామ్మోహనరావు

ఆమదాలవలస : సిఎం జగన్మోహన్ రెడ్డికి రాష్ట్ర ప్రజలు ఇచ్చిన ఒక్కఛాన్స్‌తో రాష్ట్రం అధోగతి పాలైందని టిడిపి జిల్లా అధ్యక్షులు కూన రవికుమార్ అన్నారు. గురువారం మండలంలోని తోటాడ, అక్కివరం పంచాయతీల్లో ఇంటింటికి వెళ్లి సూపర్ సిక్స్ పథకాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వైసిపి పాలనలో రాష్ట్రం ఇరవై ఏళ్లు వెనక్కి వెళ్లి రాష్ట్ర అభివృద్ధి కుంటుపడిందన్నారు. శ్యాండ్, ల్యాండ్, మద్యం వంటి వనరులను దోచుకొని దాచుకున్న ఘనత జగన్మోహన్ రెడ్డికే దక్కిందన్నారు. రానున్న ఎన్నికలలో జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వాన్ని ఇంటికి సాగనంపి టిడిపిని ఆదరించి సైకిల్ గుర్తుపై ఓటువేసి గెలిపించాలని ప్రజలను కోరారు. జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి పేడాడ రామ్మోహనరావు, పైడి మురళీ మోహనరావు, టిడిపి మండల అధ్యక్షులు నూక రాజు, ఢిల్లేశ్వరరావు, తమ్మినేని చంద్రశేఖర్ పాల్గొన్నారు.

కోటబొమ్మాళి: మండలం అక్కయ్యవలసలో టిడిపి రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్యే కింజరాపు అచ్చెన్నాయుడు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు బోయిన రమేష్, మండల నాయకులు హరివరప్రసాద్, వెలమల విజయలక్ష్మి, కామేశ్వరరావు, తర్ర రామకృష్ణ, కర్రి అప్పారావు, గొండు లక్ష్మణరావు, హనుమంతు అప్పలరాజు, బాడాన రమణమ్మ పాల్గొన్నారు.

అచ్చెన్నాయుడు సమక్షంలో పలువురు చేరిక

స్థానిక టిడిపి కార్యాలయంలో పలు గ్రామాలకు చెందిన వైసిపి కార్యకర్తలు, నాయకులు అచ్చెన్నాయుడు ఆధ్వర్యంలో టిడిపిలో చేరారు. వీరికి అచ్చెన్నాయుడు పార్టీ కండువ వేసి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో మేఘవరం పంచాయతీ నుంచి యెదురు శంకర్ రెడ్డి, నందిగాం కర్రెన్న, దల్లి ఎర్రయ్య, జలుమూరి ధనుంజయతో పాటు 100 కుటుంబాలు చేరారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు బగాది శేషగిరిరావు, జీరు భీమారావు, నాయకులు పాల్గొన్నారు.


కోటబొమ్మాళి : గ్రామస్తులతో మాట్లాడుతున్న అచ్చెన్నాయుడు

సోంపేట: మండలంలోని రుషికుద్ద పంచాయతీలో గురువారం ఎమ్మెల్యే బెందాళం అశోక్ జనసేన, బిజెపి నాయకులతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రబాబు నాయుడు ప్రకటించిన ఆరు పథకాలను ప్రజలకు వివరించారు. రానున్న ఎన్నికల్లో ప్రజలంతా టిడిపి కూటమికి ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో జనసేన నాయకులు దాసరి రాజు, లోల్ల రాజేష్, స్థానిక నాయకులు సంధి జానకిరామ్, టి హరినాథ్, టి.ఢిల్లేష్, ఎన్.జయరావు పాల్గొన్నారు.

నాలుగో రోజుకు శిబిరాలు


నరసన్నపేట : ప్రిన్సిపాల్‌ను సన్మానిస్తున్న బ్లడ్‌బ్యాంక్ ప్రతినిధులు

ప్రజాశక్తి- నరసన్నపేట

స్థానిక ఎల్‌విఆర్ డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రత్యేక సేవా శిబిరం నాల్గవ రోజు గురువారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 22 మంది వాలంటీర్లుతో పాటు ప్రిన్సిపాల్ ప్రసాదరావు, పిఒ మోహనరావు పాల్గొని రక్తదానం చేశారు. అనంతరం రక్తదానం చేయడం వలన వచ్చే లాభాలు, రక్తదానం ఏ వయసు వారు చేయొచ్చునన్న అంశాలపై ప్రిన్సిపాల్ ప్రసాదరావు, పిఒ మోహనరావు అవగాహన కల్పించారు. అనంతరం మోక్ష బ్లడ్ బ్యాంక్ ప్రతినిధులు ప్రిన్సిపాల్, పిఒను జ్ఞాపకతో సన్మానించారు. కార్యక్రమంలో మోక్ష బ్లడ్ బ్యాంక్ ప్రతినిధులు కోటీశ్వరరావు, శ్యామ్‌సుందర్, సిబ్బంది కళ్యాణి, రాంబాబు, వలంటీర్లు పాల్గొన్నారు.

కొత్తూరు: మండలంలోని గురండిలో శ్రీవేంకటేశ్వర డిగ్రీ కళాశాలకు చెందిన ఎన్ఎస్ఎస్ విద్యార్థులు 4వరోజు కార్యక్రమంలో భాగంగా పాఠశాల, దేవాలయం ప్రాంగణంలో కళాశాల డైరెక్టర్ డైరెక్టర్ జి.కృష్ణారావు, సర్పంచ్ బోర సింహాద్రినాయుడు మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మొక్కలు నాటడం వలన పర్యావరణ పరిరక్షణ సమతుల్యత వస్తుందన్నారు. కార్యక్రమంలో పిఒలు చిరంజీవి, హరిప్రసాద్ పాల్గొన్నారు.


కొత్తూరు : మొక్కలు నాటుతున్న కృష్ణారావు, సింహాద్రినాయుడు, విద్యార్థులు

ఓటు... మీ భవిష్యత్‌ను నిర్ణయిస్తుంది


పోలాకి : ర్యాలీ నిర్వహిస్తున్న సంఘాల మహిళలు



కొత్తూరు : ర్యాలీ నిర్వహిస్తున్న మహిళలు

ప్రజాశక్తి- పోలాకి

ప్రజాస్వామ్యంలో ఓటుకు చాలా ప్రాధాన్యత ఉంది. మీ ఓటు మీ భవిష్యత్‌ను నిర్ణయిస్తుందని ఎపిఎం జి.రాజారావు అన్నారు. గురువారం మబగాంలో స్వయంశక్తి సంఘాల మహిళలతో ఓటుహక్కుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ర్యాలీ, మానవహారం నిర్వహించారు. ప్రతిజ్ఞ చేయించారు. ఓటుహక్కును ప్రతిఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సిసి శాంతి కుమారి, విఒఎలు పాల్గొన్నారు.

కొత్తూరు: అర్హులైన ప్రతిఒక్కరు రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ఓటును వినియోగించుకోవాలని మండలి మహిళా సమైక్య వెలుగు ఆధ్వర్యంలో మండల కేంద్రంతో పాటు కర్లెమ్మ గ్రామ పురవీధుల్లో అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎపిఎం జనార్దన, మహిళ సమైక్య అధ్యక్షురాలు జి.సుధీష్ణ, పాలశెట్టి సింహాద్రి, సిసి జ్యోతి తదితరులు పాల్గొన్నారు.



సోంపేట : ర్యాలీ నిర్వహిస్తున్న మహిళ సమాఖ్య సభ్యులు

సోంపేట: మండల మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో ఓటుహక్కుపై అవగాహన ర్యాలీ, మానవ హారం చేపట్టారు. మండలంలోని మత్స్యకార గ్రామాల్లో ఓటుహక్కు నీ భవిష్యత్‌కు మార్గం అంటూ నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎపిఎం రవణమ్మ, సిసిలు రాణి, ధనలక్ష్మి, తేజ పాల్గొన్నారు.

వైసిపి ఇంటింటా ప్రచారం


వజ్రపుకొత్తూరు : ప్రచారం చేపడుతున్న వైసిపి నాయకులు

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

ప్రతి పేదవాడి ఇంటికి ప్రభుత్వ పథకం అందించిన ప్రభుత్వం వైసిపి అని జిల్లా పార్టీ ఉపాధ్యక్షులు, జెడ్‌పిటిసి ప్రతినిధి పాలిన శ్రీనివాస్ అన్నారు. గురువారం ఉంద్రుకుడియాలో నిర్వహించిన ప్రచారంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ ప్రజలు వాస్తవాలు గమనించాలని కోరారు. మన పాలన మనమే చేసుకునేలా మనకు ఒక అవకాశం కల్పించిన నాయకుడు జగన్మోహన్ రెడ్డి అని తెలిపారు. ఇంత గొప్ప ప్రభుత్వం మళ్లీ రావాలంటే ఫ్యాన్ గుర్తుపై ఓటువేసి ఎంపి అభ్యర్థి పేరాడ తిలక్, ఎమ్మెల్యే అభ్యర్థి మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజును గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపి ప్రతినిధి తమ్మినాన శాంతారావు, సర్పంచ్ కొర్ల వెంకటేష్, కంచరాన పీతాంబరం, కె.లక్షణరావు, తవిటినాయుడు పాల్గొన్నారు. అలాగే కంబాలరాయుడు పేటలో సర్పంచ్ వంక చిరంజీవి అధ్వర్యంలో ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో వైసిపి క్లస్టర్ ఇన్‌ఛార్జి మద్దిల హరినారాయణ, ఎంపిటిసి కారి వెంకటరావు, క్లస్టర్ ఇన్‌ఛార్జి కర్ని శ్రీను, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పలాస: మండలం బంటు కొత్తూరులో పిఎసిఎస్ అధ్యక్షులు పైల వెంకటరావు చిట్టి ఇంటింటికీ తిరిగి ప్రచారం చేపట్టారు. కార్యక్రమంలో కొమర దేవరాజు, పైల నర్సింహమూర్తి, గజ్జి బాలయ్య, కింతల బాబూరావు, మూల దయాకర్, ఎంపిపి ప్రతినిధి ఉంగ సాయికృష్ణ, మాజీ పిఎసిఎస్ అధ్యక్షులు చింతాడ మాధవరావు, ఎంపిటిసి ప్రతినిధి బమ్మిడి దుర్యోధనరావు, జెసిఎస్ కన్వీనరు దువ్వాడ రవి, గొండు మోహనరావు, వైకుంఠరావు పాల్గొన్నారు.

కోటబొమ్మాళి: ఎంపిపి రోణంకి ఉమామల్లేశ్వరరావు, మండల అధ్యక్షుడు నూక సత్యారాజు ఆధ్వర్యంలో స్థానిక విద్యుత్‌నగర్‌లో ఇంటింటికి వెళ్లి ప్రచారం నిర్వహించారు. ఎమ్మెల్యే అభ్యర్థిగా దువ్వాడ శ్రీనివాస్, ఎంపీ అభ్యర్థిగా పేరాడ తిలక్‌ల గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ కాళ్ల సంజీవరావు, వైస్ ఎంపిపిలు బోయిన నాగేశ్వరరావు, దుక్క రోజా, కళింగ కార్పోరేషన్ డైరెక్టర్ హేమసుందరరాజు, సచివాలయ కన్వీనర్ గడ్డవలస నాగభూషణరావు పాల్గొన్నారు.

కూటమిపై విమర్శలు తగవు

వజ్రపుకొత్తూరు: సార్వత్రిక ఎన్నికల్లో టిడిపి, జనసేన, బిజెపి కూటమి విజయ దుందుభి మోగిస్తుందని టిడిపి పూండి క్లస్టర్ ఇన్‌ఛార్జి పుచ్చ ఈశ్వరరావు అన్నారు. గురువారం పూండిలో విలేకరులతో మాట్లాడారు. ఎన్నికల్లో రాజకీయ పార్టీలు పొత్తులు పెట్టుకోవడం సహజమన్నారు. వైసిపి నాయకులు బూతద్దంలో చూపుతూ విమర్శలు చేయడం తగదన్నారు. మాజీ మండల విప్ రమణ ఉన్నారు.

54 మందికి దంత వైద్య పరీక్షలు

టెక్కలి : మండలంలోని ధర్మనీలాపురంలో టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాల మూడో జాతీయ సేవా పథకం ఆధ్వర్యాన గురువారం ఉచిత దంత వైద్య పరీక్షలు నిర్వహించారు. దంత వైద్యులు బాలప్రసాద్, డాక్టర్ అనూష 54 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ తెంబూరు గోవిందమ్మ, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ బేపల సంతోష్‌కుమార్, పిఒ డి.వాసుబాబు పాల్గొన్నారు.


పిల్లల ఆలోచనలకు స్వేచ్ఛనివ్వాలి

శ్రీకాకుళం అర్బన్: జన్యుపరమైన సమస్యలతో ఎదుగుదల, ఆలోచనాశక్తి లేని పిల్లలకు డౌన్ సిండ్రోం వ్యాధి ఉంటుందని, ప్రపంచ వ్యాప్తంగా వెయ్యి మంది పిల్లల్లో ఒకరికి ఇటువంటి వ్యాధి లక్షణాలు వస్తున్నాయని ఖ్యాతి ఫౌండేషన్ నిర్వహకులు రఘుపతి శ్రావణి తెలిపారు. జిల్లా సర్వజనాస్పత్రి డిఇఐసిలో ప్రపంచ డౌన్ సిండ్రోమ్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అనంతరం పెన్సిల్స్, ఫ్రూటీ, రస్క్ పంపిణీ చేశారు.

స్వతంత్ర అభ్యర్థిని దింపుతాం

పలాస : రానున్న సార్వత్రిక ఎన్నికల్లో పలాస నియోజకవర్గంలో ఎస్‌సి, ఎస్‌టి, మైనార్టీ వర్గాలకు చెందిన నాయకుడును స్వతంత్ర అభ్యర్థిగా దింపడం జరుగుతుందని ఎస్‌సి, ఎస్‌టి, మైనార్టీ నాయకులు వెల్లడించారు. గురువారం విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ నియోజవర్గంలో ఎస్‌సి, ఎస్‌టి, మైనార్టీలకు 35 వేలఓట్లు ఉన్నాయని, గతం నుంచి నేటి వరకు తమను పాలకులు ఓటు బ్యాంకుగానే చూస్తున్నారని, తమ చిన్నచిన్న సమస్యలు కూడా పరిష్కరించలేదన్నారు. కాశీబుగ్గ శ్మశానవాటికలో నాలుగేళ్ల క్రితం పవర్‌బోర్ ఏర్పాటు చేస్తామని హామి ఇచ్చి నెరవేర్చలేదని, ప్రహరీగోడ నిర్మాణం కూడా చేపట్టలేదన్నారు. మంచి నాయకుడిని ఎంపిక చేసి ఎన్నికల బరిలో దింపాలని నిర్ణయించుకోవడం జరిగిందన్నారు. నియోజకవర్గ స్థాయిలో అన్ని గ్రామాల్లో పర్యటించి తమ అభ్యర్థి పేరు ప్రకటించడం జరుగుతుందన్నారు. సమావేశంలో జిల్లా లీగల్ ఎడ్వయిజర్ జిఎంఎఫ్ అనీల్ రాజ్, ఆల్‌ఇండియా క్రిసియన్ కౌన్సిల్ రాష్ట్ర కార్యదర్శి గంజి ఆర్ ఎజ్రా, జిల్లా అధ్యక్షులు కొత్తపల్లి అబ్రహం, బిషప్ సుందర్సింగ్, సూరాడ డానియల్, ఎంఆర్‌పిఎస్ నాయకులు మీల జోగారావు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎజ్రా


ఫిర్యాదు చేస్తున్న పరమేశ్వరరావు

తప్పుడు పోస్టులు తగదు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

ఎన్నికల వేళ కాంగ్రెస్ పార్టీ ప్రతిష్టను దిగజార్చేందుకు కొంతమంది వాట్సప్ గ్రూపుల్లో, సామాజిక మాధ్యమాల్లో తప్పుడు పోస్టులు పెడుతున్నారని, అటువంటి వారిపై తక్షణా చర్య తీసుకోవాలని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు పేడాడ పరమేశ్వరరావు కోరారు. ఈ మేరకు జిల్లా పోలీస్ కార్యాలయం సైబర్ ఫిర్యాదుల విభాగంలో గురువారం ఫిర్యాదు చేశారు. ఇటీవల కొంతమంది కొన్ని ప్రయివేటు వాట్సాప్ గ్రూపులు ఏర్పాటు చేసి ఆ గ్రూపుల్లో తమ అనుమతి లేకుండా తమని సభ్యులుగా చేర్చి కాంగ్రెస్ పార్టీ పైన రాష్ట్ర, జిల్లాస్థాయి నాయకులపైన అపవాదులతో పోస్టులు పెడుతున్నారని అన్నారు. ఇది తీవ్ర అభ్యంతరకరమని ఫిర్యాదులో పేర్కొన్నారు. వాటికి సంబంధించిన పూర్తి ఆధారాలను సైబర్ క్రైమ్ పోలీసులకు అందజేశారు. ఆయనతో పాటు పిసిసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పైడి నాగభూషణరావు, రాష్ట్ర అధికార ప్రతినిధి చింతాడ దిలీప్, కాంగ్రెస్ పార్టీ దళిత విభాగం జిల్లా అధ్యక్షులు కోర్రాయి ప్రసాదరావు, జిల్లా కిసాన్ సెల్ అధ్యక్షులు కోత మధుసూదనరావు పాల్గొన్నారు.

క్రైమ్ కార్నర్

మహిళ ఆత్మహత్య

ప్రజాశక్తి- కవిటి

మండలం మాణిక్యపురంకు చెందిన జానకి బిసాయి (43) ఆత్మహత్యకు పాల్పడింది. ఎస్ఐ కె.రాము అందించిన సమాచారం మేరకు జానకి బిసాయికి వివాహం జరక్కపోవడంతో ఒంటరిగా ఉంటోంది. వివాహం జరక్కపోవడం, ఒంటరిగా ఉండడంతో మనస్తాపం చెంది బుధవారం రాత్రి ఇంట్లో దూలానికి ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్టు ఆయన తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టంకు పంపించామని, జానకి సోదరుడు దేవరాజు సాహు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.


కొండ పక్కన్న ఉన్న అస్తిపంజరం

విశ్వనాథపురంలో అస్తిపంజరం లభ్యం

భయాందోళనలో గ్రామస్తులు

ప్రజాశక్తి- కోటబొమ్మాళి

మండలం విశ్వనాథపురంలో కొండ సమీపంలో గురువారం గుర్తుతెలియని అస్తిపంజరం గ్రామస్తుల కంటపడింది. దీంతో గ్రామస్తులు స్థానిక విఆర్ఒ పైల దాలప్పకు సమాచారం ఇవ్వటంతో ఆయన స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఎస్ఐ షేక్ మహ్మద్ ఆలీ కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు. పోలీసుల వివరాల మేరకు విశ్వనాథపురం గ్రామానికి చెందిన పలువురు గురువారం ఉదయం కొండ పక్కనుంచి వెళ్తుండగా కొండ పక్కన అస్తిపంజరం గ్రామస్తుల కంటపడింది. ఈ అస్తిపంజరం ఆడ, మగ అనేది గుర్తుపట్టలేని రీతితో ఉండటంతో వారు బయపడి గ్రామానికి చేరుకొని సచివాలయ పోలీస్, విఆర్ఒకు సమాచారం అందజేశారన్నారు. ఈ అస్తిపంజరం ఎవరిది, ఇక్కడకు ఎలావచ్చి ఉంటుందోనని గ్రామస్తులు భయాదోళన వ్యక్తం చేస్తున్నారు.

చుక్కల దుప్పి మృతి

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

మండలం తెలినీలాపురం విదేశీపక్షుల విడిది కేంద్రంలో గురువారం ఒక చుక్కల దుప్పి మృతి చెందింది. కొద్దిరోజుల క్రితం నందిగాం మండలం రాంపురం సమీపంలోని తెట్టంగి పంట పొలాల్లో ఇరుక్కున్న దుప్పిని గ్రామస్తుల సమాచారంతో అటవీశాఖ అధికారులు తెలినీలాపురం విడిది కేంద్రంలో ఉంచారు. ఈ క్రమంలో గురువారం దుప్పి అస్వస్థతకు గురై మృతి చెందింది. దీంతో అటవీశాఖ అధికారుల పర్యవేక్షణ లోపమే కారణమని ఆరోపణలు వస్తున్నాయి.


చెక్‌పోస్టు వద్ద వాహనాలు తనిఖీ చేస్తున్న ఎస్ఐ, సిబ్బంది

చెక్‌పోస్టు ఏర్పాటు

కొత్తూరు: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా మండలంలోని కర్లెమ్మ వద్ద గురువారం అంతర్రాష్ట్ర చెక్‌పోస్ట్‌ను ఎస్ఐ ఎం.ఎ.అహమ్మద్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. అనంతరం విస్తృతంగా వాహన తనిఖీలు చేపట్టారు. ఈ చెక్‌పోస్టు రాత్రి, పగలు పని చేసేందుకు సిబ్బందిని నియమించామన్నారు. ఎటువంటి పత్రాలు లేకుండా అక్రమంగా నగదును తరలిస్తే నగదు స్వాదీనం చేసుకొని కేసులు నమోదు చేస్తామని ఎస్ఐ తెలిపారు.


ప్రచారం నిర్వహిస్తున్న స్వతంత్ర ఎమ్మెల్యే అభ్యర్థి రాజశేఖర్

కుటుంబ రాజకీయాలకు స్వస్తి పలకాలి

బూర్జ: మండల కేంద్రమైన బూర్జలో గురువారం స్వతంత్ర అభ్యర్థి లోలుగు రాజశేఖర్ ఇంటింటికి వెళ్లి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో కుటుంబ పాలన కొనసాగుతుందని, కుటుంబపాలనకు వీడ్కోలు చెప్పేందుకు ప్రతిఒక్కరు ముందుకు రావాలన్నారు. రాజు, అప్పలనాయుడు, సూరయ్య పాల్గొన్నారు.

ఆశావర్కర్లను నియమించాలి

రణస్థలం: మండల కేంద్రంలోని గరికిపాలేం కాలనీ, లక్ష్మీనగర్ కాలనీలో నాలుగేళ్లుగా ఖాళీగా ఉన్న ఆశా వర్కర్ల పోస్టులను ప్రభుత్వం తక్షణమే భర్తీ చేయాలని ఆ ప్రాంతవాసులు కోరుతున్నారు. ఈ సందర్భంగా కాలనీవాసులు మాట్లాడుతూ ప్రజల ఆరోగ్య వివరాలు తెలుసుకొని, ఎప్పటికప్పుడు ప్రభుత్వానికి సమాచార మందించే ఆరోగ్య వారధులు ఆశ కార్యకర్తలని, గర్భిణులకు, బాలింతలకు మందులు అందించడం, ప్రభుత్వ వైద్యశాలల్లో డెలివరీలు అయ్యేలా చూడడం, పిల్లలకు టీకాలు వేయించడం, తద్వారా మాతా, శిశు మరణాలు తగ్గించడం, నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ దగ్గు, జ్వరం, జలుబు వ్యాధులకు మందులు అందజేస్తూ ఆరోగ్యంపై అవగాహన కల్పిస్తూ రోగాల కట్టడికి చర్యలు చేపడుతుండేవారన్నారు.

పాతవరకలో జగనన్న గృహప్రవేశం

కవిటి : ఇల్లు కట్టి చూడు, పెళ్లి చేసి చూడు అన్నారు పెద్దలు. ప్రస్తుతం సామాన్యుడికి ఈ రెండూ తలకు మించిన భారమే. ఇటువంటి పరిస్థితుల్లో నిరుపేదలు కూడా తన కంటూ ఓ గూడు కట్టుకుంటే వారి ఆనందానికి అవధులు ఉండవు. సరిగ్గా అటువంటి అవధులు లేని ఆనందాన్నే పొందుతున్నారు కవిటి మండలం పాతవరక గ్రామానికి చెందిన ప్రమీల సాహు. పాత వరకలో తనకు కేటాయించిన జగనన్న కాలనీలో గురువారం ఆమె గృహ ప్రవేశం చేసింది. ఈ సందర్భంగా ప్రమీల సాహు మాట్లాడుతూ తనకంటూ ఓ గూడు కట్టుకునేందుకు స్థానిక నేతలు అందించిన సహకారం మరువలేనిదని, అయితే ఎన్నికల కోడ్ ఉండడంతో నాయకులు తన గృహ ప్రవేశానికి రాకపోవడం పెద్దలోటని కొంత నిరాశ వ్యక్తం చేసింది.


నూతన గృహం వద్ద ప్రమీల, సాహు కుటుంబం